మిన్నంటిన క్రీడోత్సాహం

- నందదిగా క్రీడా పోటీలు
- విద్యార్థుల హుషారు


త్రో బాల్ ఆడుతున్న విద్యార్థినులు

ప్రకాశం నగర్: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థుల్లో తమ క్రీడా ప్రతిభను కనబరుస్తున్నారు. స్కూల్స్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక ఎస్‌కేవీటీ గవర్నమెంట్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఈ పోటీలకు అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ వంటి తొమ్మిది క్రీడల్లో పోటీలు జరుగుతున్నాయి. వీటితో పాటు మరో 21 క్రీడాంశాల్లో నేరుగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.

పారదర్శకంగా ఎంపికలు

2023–24 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు సంబంధించి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేసింది. వాటికి అనుగుణంగా క్రీడాకారుల ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గ స్థాయి పోటీలు ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన జట్టును జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారు.

సద్వినియోగం చేసుకోవాలి

స్కూల్ గేమ్స్ ఆటల పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ఆయా క్రీడాల్లో ప్రోత్సహించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. నైపుణ్యాన్ని బట్టి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే అవకాశం ఉంటుంది.

– దిలీప్ కుమార్, అర్బన్ డీఈ

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలి


సమావేశంలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పార్కులను అభివృద్ధి చేసి నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఏకేసీ కాలేజీ, అంబేడ్కర్ పార్కుల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్ల డివైడర్లలో మొక్కలకు ప్రతి రోజూ నీరు పోయాలన్నారు. అదనంగా వచ్చిన కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించి అందంగా కనబడేలా తీర్చిదిద్దాలన్నారు. డివైడర్లను ప్రతి రోజు శుభ్రం చేయుటకు షెడ్యూలు తయారు చేసి, తదనుగుణంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. సెంట్రల్ జైల్ వద్ద గల పార్కులోని పచ్చదనాన్ని పెంపొందించాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, ఉద్యాన అధికారి దేవానంద్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా దీపాలంకరణ


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం సిటీ: 23వ డివిజన్ పరిధి నందివాడ వారి వీధిలోని వజ్రగణపతి ఆలయం వద్ద సాయిగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ 22వ వార్షికోత్సవం, లక్ష్మి గణపతి నవరాత్ర ఉత్సవాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాతూరి యతిరాజ్ సంపత్ కుమార్, రేణుక, చందాసత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, సూర్య కుమారి దంపతులచే దీపాలంకరణ జరిగింది.

క్లుప్తంగా

గురుకులంలో కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలోని వెయ్యి మంది విద్యార్థులకు వేమగిరిలోని పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ చిన్నారుల్లోని కంటి సంబంధిత సమస్యలను గుర్తించేందుకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించామన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ మహాజన సభ రేపు


విలేకరులతో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్ పర్సన్ రామకృష్ణ తులసి

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 104వ సాధారణ మహాసభను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి తెలిపారు. బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖాతాదారులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రూ.1094.55 కోట్లతో ఖాతాదారులకు సేవలు అందిస్తూ బ్యాంక్ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, పతివాడ రమేష్‌బాబు, పెంకే సురేష్, యర్రా ప్రసాదరావు, బిల్డర్ చిన్నా, మార్గాని సురేష్, రాయుడు గణేష్, వెంట్రపాటి సురేష్, గొర్రిపాటి చినబాబు, సీఈఓ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి ప్రముఖుల పూజలు


స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కడియం: స్థానిక పోస్టాఫీసు వీధిలోని లక్ష్మీగణపతిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి స్వామివారికి పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ సాదర స్వాగతం పలికింది. కాగా స్వామివారి ఆలయం వద్ద నిత్య పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

డైట్‌లో కార్యశాల

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో శుక్రవారం 8, 9 తరగతుల జీవశాస్త్ర పాఠ్యపుస్తకాలలో కఠిన అంశాల గుర్తింపుపై కార్యశాల నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 8, 9 తరగతులకు జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులు హాజరై వివిధ అధ్యాయాలలో కఠినతరమైన అంశాలను గుర్తించారు. కార్యశాలకు సమన్వయకర్తలుగా కేవీ సూర్యనారాయణ, కె.గంగాధరరావు, డి.సుజాతారత్నం, ఎస్.ఎ స్టేర్ వ్యవహరించారు.

క్రైం సీఐగా విద్యాసాగర్


ఎస్పీ జగదీష్‌ను కలిసిన సీఐ విద్యాసాగర్

కంబాలచెరువు: రాజమహేంద్రవరం వన్‌టౌన్ క్రైం సీఐగా సీహెచ్ విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాసాగర్ ఇప్పటివరకూ జగ్గంపేట ఎస్సైగా పనిచేశారు. పదోన్నతిపై వన్‌టౌన్‌కు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

27న వామపక్షాల నిరసన

ప్రకాశం నగర్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నట్టు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు పిలుపునిచ్చారు. శ్యామలా సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణల చట్టాన్ని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఓబీసీ బిల్లు సాధించే వరకూ ఉద్యమం


ఢిల్లీలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: పార్లమెంట్‌లో విజయవంతంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదించడంపై జాతీయ బీసీ సంఘం జాతీయ మహిళాధ్యక్షురాలు డాక్టర్ పద్మలత హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో రాజకీయాల్లో లింగ వివక్షను అధిగమించవచ్చన్నారు. ఢిల్లీలోని ఆంధ్రాభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ మహిళా సబ్ కోటా లేకుండా మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం దేశంలో 70 కోట్ల బీసీలకు ఆవేదన కలిగించిందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాజ్యసభలో ప్రధాని మోదీని కలిసి బీసీ మహిళా సబ్ కోటా విషయం తెలిపారన్నారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించడం ఆశాజనకంగా ఉందన్నారు. ఓబీసీ బిల్లు సాధించే వరకు ఉద్యమిస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రత సమష్టి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పరిసరాల పరిశుభ్రత సమష్టి బాధ్యత అని, సిబ్బంది తాము పనిచేస్తున్న ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిబ్బందితో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అధికారి, సిబ్బంది తాము కూర్చునే క్యాబిన్లు, టేబుల్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇది నిరంతరం జరగాలన్నారు. కోటిలింగాలపేట నుంచి నల్లా చానల్ వరకూ గల ఘాట్ మొత్తాన్ని శనివారం కార్యాలయం సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో కలిసి శుభ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, ఈఈ మదర్‌షా అలీ పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించడమే మన లక్ష్యం

- పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా నియమితులైన ట్రస్ట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్లు, అర్బన్ బ్యాంకుల పాలకమండళ్లతో శుక్రవారం స్థానిక తిలక్ రోడ్డులోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత వివరంగా తెలియజేయాలన్నారు. అదే సమయంలో గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీకి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నియామకాలు జరిగాయని, పార్టీ కోసం అంకిత భావంతో చేసి సంస్థాగత పటిష్టతకు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి కానుబోయిన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులు


ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పనులను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

స్థానిక ఉమామార్కండేయశ్వరస్వామి ఆలయంలో గోపురం, ధ్వజస్తంభం, ఆలయం లోపలి మురుగు నీరు వెళ్లేందుకు కాలువ నిర్మాణం పనులను రూ.1.25 కోట్లతో చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పాలకమండలి నియమించడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఇవి పూర్తయితే ఆలయం నూతన శోభ సంతరించుకుంటుందన్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో అతి ప్రాచీన దేవాలయాలు చాలా ఉన్నాయని, వాటికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సూచనలతో ఎంపీ భరత్ రామ్ పాలక మండళ్లను నియమించారన్నారు. ఇప్పుడు పాలకమండళ్ల ఆధ్వర్యంలో అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమామార్కండేయశ్వర స్వామి ట్రస్ట్ కమిటీ చైర్మన్ ఇన్నమూరి దీపు, డైరెక్టర్లు యరకల రజని, అవినాష్, యజ్జరపు శ్రీనివాస్, రాఘవేంద్రరావు, నీలకంఠ శర్మ, గోవిందు, మాజీ మాజీ కార్పొరేటర్లు పాలసానపల్లి హనుమంతరావు, వాకచర్ల కృష్ణ, నాయకులు ఉదయ భాస్కర్, దాసరి ప్రసాద్, రామ చంద్రరావు, గోవిందు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం


విజేతలకు పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అన్నారు. ఆ కళాశాలలో శుక్రవారం ప్రపంచ క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల దినోత్సవం నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలకు ప్రధాన కారణాలలో క్యాన్సర్ ఒకటన్నారు. వ్యాధిపై అవగాహన కల్పించడం, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జంతుశాస్త్ర విభాగం వక్తృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రియాంక, పి.దీపికా రాణి పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలి


ప్రచారయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆశాఖ జిల్లా అధ్యక్షుడు జయకర్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ ప్రచార యాత్ర, 50 సంవత్సరాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్‌ను 1974లో స్థాపించారని, ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ ప్రచారయాత్ర ప్రారంభమైందన్నారు. అలాగే అనంతపురం జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకూ రెండో ప్రచార యాత్ర జరుగుతోందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ఈ రెండు ప్రచార జాతాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నాయన్నారు. విద్యారంగం బలోపేతానికి మేధావులతో చర్చించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రచార యాత్ర ఈనెల 24న మన జిల్లా గోకవరంలో ప్రవేశించి, 25న అనపర్తి నుంచి కాకినాడ జిల్లాకు వెళుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఈవీఎస్ఎస్ ఆర్ ప్రసాద్, విజయ గౌరీ, రమేష్, రవి, తాతారావు, ప్రకాష్, శ్రీనివాస్, విజయ్‌బాబు, అనిత పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ


పూజలు నిర్వహిస్తున్న మహిళలు, విద్యార్థులు

కడియం: కడియపులంక గ్రామదేవత ముసలమ్మ ఆలయం వద్ద శుక్రవారం రాత్రి విద్యాలక్ష్మీ గణపతి స్వామికి సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, విద్యార్థులు పూజలో పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రకాశం నగర్: కేరళలోని త్రివేండ్రంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన తాళం తాత్వశ్రీ వెండి పతకం సాధించింది. అలాగే విశాఖపట్నంలో జరిగిన స్టేట్ కరాటే పోటీల్లో తాళం కార్తిక్ కాంస్య పతకం సాధించాడు. వారిని, కోచ్ మధు రామకృష్ణను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శుక్రవారం అభినందించారు.

- విశాఖపట్నం, కేరళలో జరిగిన కరాటే పోటీల్లో విజేతలకు నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఎస్ఈ పాండురంగారావు సర్టిఫికెట్లు అందజేశారు. మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్‌ను అభినందించారు.

ఆన్‌లైన్‌లో పిల్లల వివరాల నమోదు

కంబాలచెరువు: అర్బన్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో గల పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ మూడేళ్ల పిల్లలను ఎల్‌కేజీ, నాలుగేళ్ల పిల్లలను యూకేజీలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ శిక్షకులకు దీక్ష యాప్ ద్వారా ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చామని, వాటిలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నాడు – నేడు పనుల ప్రగతిని డీఐ సమీక్షించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతి గదిలో వంట చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులున్న చోట వంట చేయరాదన్నారు. ప్రత్యేక ప్రదేశాలలో మాత్రమే చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, నాగమణి, కోటేశ్వరి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బీజేపీ కార్యాలయంలో యువమోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ప్రారంభించారు. మనోజ్ మాట్లాడుతూ 94 మంది యువమోర్చా, పార్టీ నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, వారికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బేతిరెడ్డి ఆదిత్య, కండికొండ రమేష్, యెనుముల రంగబాబు, కురగంటి సతీష్, కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమాచార హక్కుచట్టంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దామిశెట్టి నాగరాజు, పళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాచార హక్కుచట్టం జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తదితరులు మాట్లాడారు. చట్టం ప్రయోజనాలను వివరించారు. ఎంఈవో లజపతిరాయ్, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, న్యాయవాది తోరాటి వసంతరావు, తమ్మిశెట్టి ప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భార్య తిరిగి రాలేదని శాటిలైట్ సిటీ బిబ్లాక్‌కు చెందిన చింతా హర్షకుమార్ శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. హర్షకుమార్‌కు 28 ఏళ్ల మణి మేఘనతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 20వ తేదీ రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. అనంతరం హర్షకుమార్ బయటకు వెళ్లి, తిరిగి వచ్చేసరికీ భార్య మేఘన కనిపించ లేదు. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

శ్యామల	: ఖుషి
సూర్యమినీ	: దినస్–2
సూర్యప్యాలెస్	: 7జి బృందావన్ కాలనీ
స్వామి	: మార్క్ ఆంటోని
శివజ్యోతి	: మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
అనుశ్రీ	: ఎక్స్‌పెండబుల్స్
రాజా	: మార్క్ ఆంటోని
అశోక	: సప్తసాగరాలు దాటి
ఊర్వశి	: జవాన్
రంభ	: దినస్–2
మేనక	: జైలర్
అప్సర	: జవాన్
నామవరం	
వీఎస్ మహల్	: మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మార్క్ఆంటోని
కడియం	
వెంకటసూర్య	: మార్క్ ఆంటోని

‘నన్నయ’లో ఈసీ మెంబర్‌కు సత్కారం


ఈసీ మెంబర్ నారాయణరావును సన్మానిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా ఉన్న గంధం నారాయణరావును బీఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 35 సంవత్సరాలు సేవలందించిన నారాయణరావు లిటిల్ రోస్ విద్యా సంస్థల చైర్మన్‌గా, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యావేత్తగా ఎంతో అనుభవశాలి అయిన ఈయనను ఈసీ మెంబరుగా నియమించడం హర్షణీయమన్నారు. గోదావరి జిల్లాలలో బీఈడీ కళాశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. గంధం నారాయణరావు మాట్లాడుతూ ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కేఎస్ రమేష్, ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతే సీఎం జగన్ ఆశయం

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆశయమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ముక్కినాడ, మల్లంపూడి గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలలో మహిళలకే అగ్రాసనం వేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ గతంలో చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, మహిళా శక్తిని చాటాలని అన్నారు. సమావేశాలలో వెలుగు ఏపీఎం హేమ నాగలక్ష్మి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.